క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

కాటారం: బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మండలంలోని చింతకాని మాజీ సర్పంచ్ మందల లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తన వ్యక్తిగత కారణాలతో బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాను ఏ పార్టీలోకి వెళ్లకుండా ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. కొంత కాలంగా బీఆర్‌ఎస్‌లో ఉంటూ సమస్యలపై పోరాడి జైలుకు సైతం వెళ్లినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న కొంత మంది కోవర్టులు తనపై ఎన్నో నిందలు వేశారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదన్నారు. కొత్తగా వచ్చిన కోవర్టులే పార్టీలో రాజ్యమేలుతున్నారని లక్ష్మారెడ్డి ఆరోపించారు.

నేడు పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

కాటారం : మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి నేడు(సోమవారం) స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులని, పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష ఉత్తీర్ణతతో సంబంధం లేదని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సరైన ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించి సీటు పొందవచ్చని వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

'తిరంగా యాత్ర'ను విజయవంతం చేయాలి

చిట్యాల: మండల కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు(సోమవారం) హర్ ఘర్ తిరంగా యాత్రను నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ప్రతి ఒక్కరూ తిరంగా యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలోని 18 నుంచి 59 సంవత్సరాలు వయసు కలిగి, గతంలో రైతు బీమా చేసుకోని రైతులు, కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు రైతు బీమా నమోదు చేసుకోవాలని ఏఈఓ పుష్పలత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుకు చివరి తేదీ ఈనెల13 వరకు ఉందని తెలిపారు. అన్నారం, చంద్రుపల్లి, కాళేశ్వరం, మెట్‌పల్లి, మద్దులపల్లి, పలుగుల రైతులు కాళేశ్వరంలో రైతు వేదికకు వచ్చి నమోదు చేసుకోవాలని తెలిపారు. జూన్ 5వ తేదీ 2025 నాటికి భూభారతిలో భూమి పట్టా నమోదు అయి ఉండాలన్నారు. రైతు బీమా దరఖాస్తు ఫాం, పట్టా పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలని తెలిపారు.

ప్రోత్సహించేందుకే టాలెంట్ టెస్ట్

కాళేశ్వరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతుతో విద్యార్థులను ప్రోత్సహించేందుకు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న వారికి ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొనడానికి విద్యార్థి విజ్ఞాన్ మంథన్ సంస్థ పరీక్షలకు ఆహ్వానిస్తోందని భూపాలపల్లి జిల్లా కోఆర్డినేటర్ మడక మధు ఆదివారం తెలిపారు. ఈ పరీక్ష ద్వారా రూ.2వేల స్కాలర్‌షిప్, రూ.25వేలు నగదు బహుమతి పొందే అవకాశం ఉందన్నారు. జూనియర్ (6–8 తరగతులు), సీనియర్ (9–12 తరగతులు) విభాగాలుగా పాఠశాల స్థాయిలో లెవెల్–1 అక్టోబర్ 28 నుంచి నవంబర్ 2వ తేదీవరకు, లెవెల్–2 నవంబర్ 19 నుంచి 23వ తేదీవరకు, రాష్ట్రస్థాయిలో డిసెంబర్ చివరి వారంలో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు స్థానాలు పొందిన వారికి వరుసగా రూ.5వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు నగదు లభిస్తుందన్నారు. జాతీయ స్థాయిలో విజేతలకు రూ.25 వేలు నగదు బహుమతి, భాస్కరా స్కాలర్‌షిప్ కింద ఏడాది పాటు నెలకు రూ.2వేలు స్కాలర్‌షిప్ అందుతుందని వివరించారు. ఈ దరఖాస్తు ప్రక్రియను https:// www.vvm.org.com వెబ్‌సైట్‌కి వెళ్లి లాగిన్ అయి వివరాలు నమోదు చేయాలి. సెప్టెంబర్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలని వివరాలకు 94409 46542 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- కాల్వపల్లిలో రోడ్డుపైనే మురుగు
- విజృంభిస్తున్నఈగలు, దోమలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు


రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాల్వపల్లిలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. వర్షకాలంలో ఈగలు, దోమలు వ్యాపించకుండా అధికారులు పరిశుభ్రత చర్యలు పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు లేకపోవడంతో రోడ్డుపై మురుగు వస్తుంది. మురుగు నీటిలో ఈగలు, దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. గ్రామంలో రోడ్ల వెంట పారిశుద్ధ్య చర్యలు చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.

పైపులైన్ లీకేజీతో నీరు నిల్వ

గ్రామంలో రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పోతోంది. లీకేజీతో గుంతలో నీరు నిల్వ ఉంటుంది. సీజనల్ వ్యాధుల కాలం పైగా మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో నీరు కలుషితమై గ్రామస్తులు ఆరోగ్య సమస్యలు తలెత్తనున్నాయి. పైపులైన్ లీకేజీలను మరమ్మతులు చేయాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. లీకేజీ అవుతుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీ కాకుండా మరమ్మతులు చేసి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


పైపులైన్ లీకేజీతో గుంతలో చేరిన నీరు

నీరు నిల్వ లేకుండా చూడాలి



రోడ్డు పక్కన నీరు నిల్వ చేరడంతో ఈగలు, దోమలతో భరించలేకపోతున్నాం. రోడ్డుపై మురగు పారడంతో దుర్వాసన వస్తుంది. నీరు నిల్వ లేకుండా చేసి దోమల బాధ నుంచి విముక్తి కల్పించాలి.

– దుబాసి, రాజమ్మ, కాల్వపల్లి

మా బావనే కూలి డబ్బులు అడుగుతావా..

- వ్యక్తిని కత్తితో పొడిచిన బావమరిది
- ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి
- సర్వాయి గ్రామంలో ఘటన


రాజబాబు(ఫైల్)

కన్నాయిగూడెం: మా బావనే కూలి డబ్బులు అడుగుతావా అంటూ బావమరిది.. ఓ వ్యక్తిని కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడి సదరు వ్యక్తి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం సర్వాయి గ్రామంలో జరిగింది. బాధితుడి భార్య మడె బేబి, ఎస్సై వెంకటేష్ కథనం ప్రకారం.. ఇదే మండలం ఏటూరు గ్రామానికి చెందిన మడె రాజబాబు (45) ఆరేళ్ల నుంచి సర్వాయి గ్రామంలో తన అత్తగారి ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి బాబు వద్దకు మేస్త్రీ పనికి వెళ్లాడు. కొద్దిగా ఆలస్యంగా వెళ్లడంతో సగం కూలి మాత్రమే ఇస్తానని కుమ్మరి బాబు అన్నాడు. పని పూర్తయిన అనంతరం సాయంత్రం రాజబాబు డబ్బులు ఇవ్వమని కోరగా కుమ్మరి బాబు, అతడి బావమరిది సర్వాయి గ్రామానికి చెందిన కోరం రంజిత్ నిరాకరించారు. అనంతరం బావబావమరుదులు కలిసి రాజబాబు ఇంటికెళ్లి ఘర్షణ పడ్డారు. దీనిపై రాజబాబు భార్య బేబి వద్దని వేడుకోగా గొడవ సద్దుమనిగింది. అనంతరం రాత్రి సుమారు 9.30 గంటలకు రాజబాబు భోజనం చేస్తుండగా కోరం రంజిత్ మరోసారి రాజబాబు ఇంటికెళ్లాడు. 'మా బావను కూలి డబ్బులు అడుగుతావా' అంటూ కత్తితో కడుపులో పొడిచాడు. రక్తపు మడుగులో ఉన్న భర్తను చూసి బేబి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి రాజబాబును ఆస్పత్రికి తరలించడానికి 108కు ఫోన్ చేయగా అంబులెన్స్ అందుబాటులో లేదు. మండల అంబులెన్స్ ప్రస్తుతం ఏటూరునాగారంలో ఉందని, ప్రైవేట్ వాహనంలో వెళ్లాలని సిబ్బంది చెప్పారు. దీంతో చేసేదేమిలేక ట్రాక్టర్‌లో తీసుకుని ఏటూరునాగారం తరలించగా అప్పటికే రాజబాబు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి భార్య బేబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

అంబులెన్స్ ఉంటే నా భర్త బతికేవాడు

కన్నాయిగూడెంలో అంబులెన్స్ అందుబాటులో ఉంటే నా భర్త 30 నిమిషాల్లో ఏటూరునాగారం చేరేవాడు. అంబులెన్స్ లేకపోవడంతో ఏమి చేయాలో తెలియక ట్రాక్టర్‌లో తీసుకెళ్లడంతో సుమారు 3 గంటల సమయం వృథా అయ్యింది. దీంతో చనిపోయాడు. అంబులెన్స్ లేకపోవడంతోనే నా భర్త ప్రాణం పోయింది.

–బేబి, మృతుడి భార్య

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం సూరారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001–02 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ములుగు జిల్లా వెంకటాపూర్(ఎం) మండలం రామప్ప ఆలయం వద్ద ఆదివారం నిర్వహించుకున్నారు. అందరూ ఒక చోట కలిసి వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.

పరామర్శ

మల్హర్: మండలంలోని వల్లెంకుంటలో తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ప్రకాశ్‌రెడ్డిని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం పరామర్శించారు. మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు కోట రాజబాబు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంలో గడదాసి శ్రీనివాస్‌కు చెందిన మారుతి ఫ్యాషన్ బట్టల షాప్ ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం అయింది. కాగా ఎమ్మెల్సీ సిరి కొండ మధుసూదనాచారి ఆదివారం షాప్‌ను పరిశీలించి శ్రీనివాస్‌కు భరోసా కల్పించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన తుమ్మల సాగర్ చేతి విరగగా అతడిని పరామర్శించి, ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. నేరేళ్ల రామకృష్ణగౌడ్, టేకుమట్ల గ్రామ అధ్యక్షు డు బొడ్డు సదానందం, ఓదెల రాజ్‌కుమార్, తోట సాగర్ ఉన్నారు.

అధ్వానంగా రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


కోతకు గురైన కాసీంపల్లి-గొర్లవీడు రోడ్డు


అధ్వానంగా వడ్లవాగు రోడ్డు

భూపాలపల్లి రూరల్ : మండలంలోని పలు గ్రామాలను కలిపే లింకు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. వానాకాలంలో భారీ వర్షాలకు కల్వర్టుల వద్ద రోడ్లు కోతకు గురవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గతేడాది భూపాలపల్లి మండలం కాసీంపల్లి గ్రామం నుంచి గొర్లవీడుకు వెళ్లే లింకు రోడ్డు కల్వర్టు వంతెన వద్ద కోతకు గురై తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే మండలంలోని కొంపెల్లి గ్రామం నుంచి జంగేడుకు వెళ్లే రోడ్డులో వడ్లవాగుపై నిర్మించిన కల్వర్టు వద్ద తెగిపోయింది. ప్రయాణికులకు తాత్కాలికంగా రోడ్డు ఏర్పాటు చేసిన ఇబ్బందులు తప్పడం లేదు. కాసీంపల్లి నుంచి గొర్లవీడుకు వెళ్లే లింకు రోడ్డుపై భూపాలపల్లి నుంచి గొర్లవీడు, నేరేడుపల్లి, చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల, జమ్మికుంట మండలాలకు నిత్యం వేలాది మంది ప్రయాణికులు వెళ్తుంటారు. కాసీంపల్లి గొర్లవీడు మధ్య కోతకు గురైన రోడ్డు పక్కన ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో కొత్తగా అటువైపు ప్రయాణించే వారు రోడ్డును గమనించిక పోవడంతో ప్రమాదాలకు గురువుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే కల్వర్టు పక్కన సీసీ రోడ్డు వేయించాలని పలు గ్రామాల రైతులు తెలుపుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మరమ్మతు చేయించాలి



మూడేళ్లగా గోర్లవీడుకు వెళ్లే రోడ్డు కోతకు గురై కల్వర్టు వద్ద ప్రమాదకరంగా ఉంది. ఈ రోడ్డుపై నిత్యం ప్రయాణికులు వాహనాల ద్వారా ప్రయాణిస్తుంటారు. ఇప్పటికే చాలా ప్రమాదాలు జరిగాయి. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డును వెంటనే మరమ్మతు చేయించాలి.

– రవీందర్, ప్రయాణికుడు, గొర్లవీడు

సిమెంట్ రోడ్డు వేయాలి



అధిక వర్షాలు వస్తే కొంపల్లి, జంగేడు వెళ్లే కల్వర్టుపై వరద ప్రవహిస్తోంది. దీంతో భూపాలపల్లి నుంచి కొంపల్లికి పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టుకు రెండు వైపులా సిమెంట్ రోడ్డు వేస్తే ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది.

– పైడాకుల లక్ష్మయ్య, కొంపల్లి రైతు

ఘనంగా ముత్యాలమ్మ బోనాలు


శివాపురంలో బోనాలతో వెళ్తున్న మహిళలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంతో పాటు శివాపురం, నాయకులగూడెం గ్రామంలో ఆదివారం ముత్యాలమ్మ బోనాల పండుగను నిర్వహించారు. మహిళలు మేళతాళాలు, డప్పుల వాయిద్యాలతో బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా ముత్యాలమ్మ గుడికి వెళ్లి బోనాలు సమర్పించారు. పాడిపంటలు చల్లగా కాపాడమని కోరుతూ తమ మొక్కులను చెల్లించుకున్నారు

'స్వార్థం కోసమే కుల ప్రస్తావన'

కాటారం: బీజేపీ నాయకుడు చల్ల నారాయణరెడ్డి రాజకీయ స్వార్థంతోనే రెడ్డిగాండ్ల కుల ప్రస్తావన తీసుకొచ్చినట్లు పలువురు రెడ్డిగాండ్ల కులస్తులు ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. దొంగే దొంగ అన్న తీరుగా నారాయణరెడ్డి వ్యవహారం ఉందని ఓ పక్క పేరులో రెడ్డి పెట్టుకోవడానికి ఆరాటపడుతూనే రాజకీయంగా ఎదగడానికి బీసీ కార్డును అడ్డుపెట్టుకోవాలని చూస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబుపై ఆరోపణలు చేసి ఫోకస్ కావాలని నారాయణరెడ్డి ప్రతీ సారి తపన పడుతున్నారే తప్ప రెడ్డిగాండ్ల కులంపై ఆయనకు ప్రేమలేదని అన్నారు. నారాయణరెడ్డి నీ స్వార్థం కోసం రెడ్డిగాండ్ల కులాన్ని వాడుకుంటున్నావని ఇప్పటికైనా పద్ధతిని మార్చుకో అని హెచ్చరించారు. రమేశ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సమ్మిరెడ్డి, లచ్చిరెడ్డి, మాధవరెడ్డి ఉన్నారు.

10శాతం రిజర్వేషన్ అమలు చేయాలి


సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ములుగు రూరల్ : ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల్లో ట్రైబల్ ఉపాధ్యాయులకు 10శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు కోరారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఏజెన్సీ మండలాల్లో షెడ్యూల్డ్ ట్రైబల్‌కి 29 శాఖల్లో లోకల్ క్యాడర్ ఉద్యోగ పోస్టులలో అవకాశం కల్పించాలని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న పండిట్, వ్యాయామ ఉపాధ్యాయులను అప్‌గ్రేడ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రభాకర్, లక్ష్మీనారాయణ, బాలాజీ, వెంకటేశ్వర్లు, రాజేష్, వెంకన్న, శ్రీనివాస్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఓ 34 విడుదలపై హర్షం


మంత్రి లక్ష్మణ్‌తో పాటు కార్పొరేషన్ చైర్మన్ వీరయ్యను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

మంగపేట : రాష్ట్ర ప్రభుత్వం జీఓ 34ను విడుదల చేయడంతో దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ ఆర్గనైజేషన్ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యను గజమాలతో హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆదివారం సత్కరించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. జీఓ 34 ద్వారా దివ్యాంగ ఉద్యోగుల బదిలీల్లో రిజర్వేషన్ కల్పిస్తూ, మానసిక వికలాంగుల కుటుంబాలకు కూడా వర్తింప చేసే విధంగా జీఓ తీసుకువచ్చిన సందర్భంగా సంతోషంతో వారిని సత్కరించినట్లు పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు


ప్రమాదస్థలంలో నుజ్జునుజ్జయిన ఆటో

వెంకటాపురం(కె): రోడ్డు ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులకు గాయాలైన సంఘటన ఆదివారం మండల పరిధిలోని వీరభద్రవరం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి వెంకటాపురం మండల కేంద్రం వస్తున్న ఆటో వీరభద్రవరం గ్రామ సమీపంలోని మలుపు వద్ద వేగాన్ని అదుపు చేయలేక పోవడంతో పాటు ముందు చక్రం బోల్టు విరగడంలో పల్టీ కొట్టింది. ఆటోలో ప్రయానిస్తున్న అంకన్నగూడెం గ్రామానికి చెందిన కుర్సం రాజారావుకు కాలు విరుగగా, నిఖిలకు, శిరీష అనే చిన్నారి తలకు గాయాలైయ్యాయి. అలాగే రాచపల్లి గ్రామానికి చెందిన అక్కెమ్మకు తలకు గాయం కాగా సూరవీడు గ్రామానికి చెందిన వెంకటరమణకు గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు 108కు సమాచారం అందించి వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. తీవ్ర గాయాలైన రాజారావు, శిరీష, అక్కెమ్మలను ములుగు ఏరియా వైద్యశాలకు రిఫర్ చేశారు.

ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు


కొత్తపల్లిగోరి మీదుగా వెళ్తున్న వాహనాలు

రేగొండ: ములుగు జిల్లాలోని మల్లంపల్లి వద్ద రోడ్డు వెడల్పు పనులలో భాగంగా పాత బ్రిడ్జి కూలింది. కాగా ఏటూరునాగారం నుంచి హనుమకొండకు వెళ్లే వాహనాలకు అంతరాయం ఏర్పడింది. దీంతో జాకారం నుంచి కొత్తపల్లిగోరి మీదుగా రేగొండ, పరకాల నుంచి హనుమకొండకు వాహనాలు ప్రయాణిస్తున్నాయి. అలాగే హనుమకొండ నుంచి కూడా ఇదే దారిగుండా వాహనాలు ప్రయాణిస్తున్నాయి. దీంతో ఈ దారి గుండా ప్రయాణిస్తున్న ప్రయాణికులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. స్థానికులు ఏటూరు నాగారం నుంచి హనుమకొండకు లేదా హనుమకొండ నుంచి ఏటూరునాగారం వైపు వెళ్లె ఏదో ఒక వాహనాలను మాత్రమే అనుమతించాలని డిమాండ్ చేస్తున్నారు.

పనులు ప్రారంభమెప్పుడో?


వ్యాపార సముదాయాల ఎదుట తొలగించిన రేకులు


భారీ వృక్షాలను తొలగిస్తున్న సిబ్బంది(ఫైల్)

- రోడ్డు వెడల్పునకు శంకుస్థాపన చేసి ఆరు నెలలు
- నోటీసుల జారీతో ఇళ్లను స్వచ్ఛందంగా కూల్చుకున్న ప్రజలు

గణపురం: మండల కేంద్రంలో ప్రధాన రహదారిని 100 ఫీట్ల రోడ్డును నిర్మించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రోడ్డు నిర్మాణంతో పాటు లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు, సైడ్ కాల్వల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసి ఆరు నెలల క్రితం పనులకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన రెండు నెలల తరువాత ఆర్‌అండ్‌బీ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉమ్మడిగా కొలతలు తీసుకొని 100 ఫీట్ల లోపు ఉన్న వ్యాపార సముదాయాలకు, ఇళ్లకు తొలగించాలని మార్కింగ్ చేశారు. వారం రోజుల వ్యవధిలోనే మార్కింగ్ ప్రకారం నిర్మాణాలు తొలగించాలని లేకుంటే తామే కూల్చివేస్తామని నోటీసులు జారీ చేశారు. వెంటనే పనులు ప్రారంభించినట్లుగా రోడ్డు వెంట ఉన్న భారీ వృక్షాలను సైతం తొలగించారు. దీంతో ఆందోళన చెందిన వ్యాపారులు, ప్రజలు కాంట్రాక్టర్ తొలగిస్తే ఇష్టారాజ్యంగా కూల్చివేస్తారని వ్యాపార సముదాయల ముందు ఉన్న రేకుల షెడ్లను తొలగించుకొగా మరి కొందరు బిల్డింగ్‌లను కూడా మార్కింగ్ వరకు కూల్చి వేసుకొని నిర్మాణం చేసుకున్నారు. మరికొంత మంది వ్యాపారులు ఇతర ప్రాంతాలకు దుకాణాలను మార్చుకున్నారు. నోటీసులు జారీ చేసి నెలలు గడిచిన పనులు ప్రారంభం కాకపోవడంతో పనులు ప్రారంభిస్తారా లేదా అనే ఆలోచనలో పడ్డారు. వర్షాకాలం కావడంతో షాపుల ముందు తొలగించిన రేకుల షెడ్లను తిరిగి ఏర్పాటు చేసుకుంటున్నారు. మరి కొందరు తాత్కాలికంగా మ్యాట్లను కట్టుకుంటున్నారు.

ప్రమాదకరంగా ఎండిన చెట్టు..


రోడ్డు వెంట ఉన్న ఎండిన చెట్టు

చిట్యాల: మండల కేంద్రం నుంచి టేకుమట్లకు వెళ్లే ప్రధాన దారిలో రైస్‌మిల్లు వద్ద ఎండిన చెట్టు ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ దారి నుంచి అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ఎండిన చెట్టు ఎప్పుడు పడుతుందో తెలియని దుస్థితి. ఏదైనా ప్రమాదం జరిగితేనే సంబంధిత అధికారులు పట్టించుకుంటారా అని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు వెంట ఉన్న ఎండిన చెట్టును తొలగించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.